సాక్షి
నిజామాబాద్
గురువారం । 9 । మే । 2024



గాలివాన బీభత్సం

కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం కురిసింది. గాలులు బీభత్సం సృష్టించాయి.

- IIలో ▸



పీఎఫ్‌ఐ, సిమికి మాతృసంస్థగా..

పీఎఫ్‌ఐ, సిమి లాంటి ఆర్గనైజేషన్లకు కాంగ్రెస్ మాతృ సంస్థగా మారిందని ఎంపీ అర్వింద్ విమర్శించారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 43.6 /23.7

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

ఇందూరు అభివృద్ధి నా బాధ్యతే..



గాడిద గుడ్డును చూపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అభ్యర్థి జీవన్‌రెడ్డి



నిజామాబాద్ నగరంలోని నెహ్రూపార్క్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

ప్రసంగిస్తున్న, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- నిజామాబాద్ గడ్డపై మూడు రంగుల జెండా ఎగరాలి
- జీవన్‌రెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపించాలి
- ఎంపీ అర్వింద్ చేసింది గాడిద గుడ్డే..
- సిద్ధులగుట్ట సాక్షిగా ఆగస్టు 15లోగా రూ. 2లక్షల రుణమాఫీ చేస్తాం
- 2021లో రైతులు చేసిన పసుపు ఉద్యమమే నన్ను ఈ స్థాయికి తెచ్చింది
- ఆర్మూర్, నిజామాబాద్ రోడ్ షోల్లో సీఎం రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి/ఆర్మూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని.. ఇందూరు ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందూరు గడ్డపై మూడు రంగుల జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10 లక్షలకు పెంపు, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతున్నట్లు చెప్పారు. వంద రోజుల్లో ఇన్ని పనులు చేస్తే.. కాంగ్రెస్ ఏం చేసిందంటూ కేసీఆర్ మాట్లాడుతున్నారన్నారు. బుధవారం ఆర్మూర్, నిజామాబాద్ నగరంలో నిర్వహించిన రోడ్ షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఐదేళ్ల క్రితం మాజీ సీఎం కేసీఆర్ కూతురు వంద రోజుల్లో చక్కెర పరిశ్రమ తెరుస్తామని, ఎర్రజొన్న, పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. దీంతో ఇక్కడి రైతులు ఎన్నికల్లో కవితకు గుణపాఠం చెప్పారన్నారు. బిడ్డ బెయిల్ కోసం నిజామాబాద్ ఆత్మగౌరవాన్ని కేసీఆర్ బీజేపీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు మోదీ చెప్పిన అబద్ధాలను మళ్లీ చెబుతూ మోసం చేస్తున్నారని వాటిని నమ్మి మరోమారు మోసపోవద్దన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్లచట్టాలు చేస్తే పంజాబ్, హర్యానా రైతులు ఢిల్లీ సరిహద్దులో ఉద్యమించి కేంద్రం మెడలు వంచారన్నారు. అదే పౌరుషాన్ని ఆర్మూర్ ప్రాంత రైతాంగం సైతం ప్రదర్శిస్తోందంటూ అభినందించారు. ఆర్మూర్ ప్రాంతంలో ఉన్న ఆదర్శ గ్రామం అంకాపూర్‌తో పాటు చైతన్యవంతమైన రైతులు ఇక్కడ ఉన్నారన్నారు. 2014, 2019లో బీఆర్‌ఎస్, బీజేపీలను గెలిపించి రైతులు మోసపోయారని.. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఆర్మూర్ సిద్దులగుట్ట సాక్షిగా ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మరో పదేళ్లు అధికారంలో ఉంటుందని.. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. పసుపు బోర్డు సాధించాలన్నా, చక్కెర కర్మాగారం తెరుచుకోవాలన్న కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలన్నారు. ఎన్నికల అనంతరం మంత్రులతో ఉపసంఘాన్ని వేసి రూ. 42 కోట్లు కేటాయించి చక్కెర కర్మాగారం ప్రారంభింపజేస్తామన్నారు. జీవన్‌రెడ్డి 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేని నేత అని తెలిపారు. నిజాయితీ గల రైతు బిడ్డకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఆర్మూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నాయకులు పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొనగా.. నిజామాబాద్‌లో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు, తాహెర్‌బిన్ హందాన్, మాజీమేయర్ సంజయ్, గడుగు గంగాధర్, మహిళా కాంగ్రెస్ నగరాధ్యక్షురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీగా మారుస్తా..



తనను గెలిపిస్తే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా మారుస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిజామాబాద్‌కు ప్రత్యేకత ఉందన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీడీ కార్మికులందరికీ పెన్షన్ అందిస్తామన్నారు. 2019లో డీఎస్ కొడుకు అని పార్టీలకతీతంగా అర్వింద్‌ను గెలిపించారని, ఇప్పుడు ఆయన అహంకార పూరిత ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు. రైతు బిడ్డనైన తనకు రైతుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. అన్నదాతల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ రైతాంగం చైతన్యవంతులని, ఈ ప్రాంతానికి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలతో సాగునీరందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. లక్కంపల్లి సెజ్‌లో వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



జిల్లా కేంద్రంలోని రోడ్ షోలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అభ్యర్థి జీవన్‌రెడ్డి, నాయకులు

ఆరడుగుల అహంకారం.. అర్వింద్

ఆరు అడుగుల అహంకారానికి నిదర్శనం ఎంపీ అర్వింద్ అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఐదేళ్లలో నిజామాబాద్ అభివృద్ధికి చేసింది గాడిద గుడ్డేనని మండిపడ్డారు. నిజామాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పసుపుబోర్డు, స్మార్ట్‌సిటీ, చక్కెర పరిశ్రమలు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చిన అర్వింద్.. ఐదేళ్ల పాటు పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. ఎన్నికలు దగ్గరకు రాగానే పసుపుబోర్డు ఉత్తర్వులు తీసుకువచ్చారని.. కానీ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించలేదన్నారు.

పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ ఆర్మూర్ ప్రజలు

ఆర్మూర్‌కు శనిలా పట్టిన నకిలీ జీవన్‌రెడ్డిని వదిలించుకోవడానికి ఈ ప్రాంత ప్రజలు ఇంకొకాయనను తెచ్చుకుంటే ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయ్యిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆర్మూర్‌లో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఇన్ని రోజుల్లో ప్రధాని మోదీ నుంచి ఎన్ని నిధులు తీసు కొచ్చాడో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో గెలిచిన ఎమ్మెల్యే ఆర్టీసీ స్థలంలో మల్టీప్లెక్స్ కట్టుకొని లాభపడితే.. తాజాగా గెలిచిన మరొకాయన విదేశాల్లో వ్యాపారాలతో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

పసుపు రైతుల ఉద్యమంతోనే గుర్తింపు

కాంగ్రెస్‌లో తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడానికి 2021 ఆర్మూర్ రైతులు చేసిన ఉద్యమమే కారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నాడు పసుపు గిట్టుబాటు ధర కోసం ధర్నా చేస్తుంటే తాను రావడానికి హైదరాబాద్ నుంచి బయల్దేరగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తనను అడుగడుగునా అడ్డుకున్నా ఉద్యమ స్థలికి చేరుకున్నానన్నారు. రైతాంగం తనను ఆదరించడంతో సోనియా గాంధీ గుర్తించి తనకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

పోలింగ్ సజావుగా జరిగేలా కృషిచేయాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈనెల 13న సజావుగా జరిగేలా సెక్టోరల్ అధికారులు కృషి చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు మలి విడత శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులకు ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా కలెక్టర్ అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎవరైనా విధులపై అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి సమాచారం అందించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవడం, చెక్ చేయడం వంటివి చేయకూడదన్నారు.

పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభమయ్యేలా చూడాలని, ఏజెంట్లు రాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసి మాక్ పోల్ చేయాలని సూచించారు. పోలింగ్ రోజు ఓటింగ్ శాతాన్ని వెంటనే ఎన్ కోర్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. 17–సి డాక్యుమెంట్, పీవో డైరీ, విజిట్ షీట్, మాక్ పోల్ సర్టిఫికెట్, 17 కాలమ్ ప్రొఫార్మా వంటివి తప్పులు లేకుండా సక్రమంగా పూరించేలా పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్లకు చేర్చాలని, వాటిని సరిచూసుకుని స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచే వరకు సెక్టోరల్ అధికారులు అక్కడే అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. సెక్టోరల్ ఆఫీసర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, మౌలిక వసతులను పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తరగతుల్లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సాకేత్ తది తరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులు, నిఘా బృందాల పనితీరు పరిశీలన

సుభాష్‌నగర్: ఎన్నికల్లో ప్రలోభాలను నిలువరించేందుకు వీలుగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు డీఎం నెజ్మీ విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సందర్శించడంతో పాటు నిఘా బృందాల(ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ టీం) పనితీరును క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తున్నారు.

పోలింగ్‌కు సమయం సమీపించడంతో తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. ఇందులోభాగంగానే బుధవారం మాధవనగర్‌లో కొనసాగుతున్న చెక్‌పోస్టు తనిఖీ చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు ఎంత మొత్తంలో అక్రమ నగదు, వస్తువులు, మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో విధు లు నిర్వహిస్తున్న నిఘా బృందాల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్‌కు సమయం సమీపించిన నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు నగదు, మద్యం పంపిణీ జరిగే అవకాశాలున్నందున గట్టి నిఘా కొనసాగించాలని అబ్జర్వర్ సూచించారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులున్నారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న వ్యయ పరిశీలకులు డీఎం నెజ్మీ

సర్వేల జోరు..



- పార్టీల విజయావకాశాలపై ఏజెన్సీల అభిప్రాయ సేకరణ
- ఇంటింటికి తిరుగుతున్న యువత
- ఫోన్ల ద్వారా ఓటర్ల నాడి తెలుసుకునే ప్రయత్నం

నిజామాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఓటర్ నాడి తెలుసుకునేందుకు పలువురు సర్వేలు చేపడుతున్నారు. పోలింగ్‌కు సమయం సమీపిస్తుండడంతో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారని అభ్యర్థులు, ప్రైవేట్ ఏజెన్సీలు సర్వేలు చేపడుతున్నాయి. నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే పలువురు సర్వేలను చేపట్టారు. ప్రస్తుతం కూడా ప్రచార పర్వం కొనసాగుతున్న తరుణంలో జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో వివిధ పార్టీలు సర్వేలు చేస్తున్నాయి. ప్రజలు ఎటు వైపు మొగ్గు చూపుతున్నారు. ఏ అభ్యర్థిని గెలిపించే అవకాశం ఉంది. అనే అంశాలతో ఈ సర్వేలు కొనసాగుతున్నాయి. జిల్లాలో పలు ఏజెన్సీలు 15 రోజులుగా తమ ప్రతినిధుల ద్వారా ఓటర్ల అభిప్రాయాలు సేకరిస్తున్నాయి.

అభ్యర్థులు సైతం

నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలో సర్వేల కోసం ఏజెన్సీలు యువ తను వినియోగించుకుంటున్నాయి. తమకు కేటాయించిన గ్రామాల్లో ఏజెన్సీలు ప్రతినిధులు నిత్యం వంద శాంపిల్స్ తీసుకుంటున్నారు. ఇందులో ఓటరు కులం, వయస్సు, ఏ పార్టీకి ఓటు వేస్తున్నారనే అంశాలు సేకరిస్తున్నారు. అలాగే పోటీలో ఉన్న అభ్యర్థులు సైతం తమ గెలుపోటములపై సర్వేలు చేయిస్తున్నారు. దీనికి తోడు ఇంటెలిజెన్స్ అధికారులు కూడా సర్వేలు చేస్తున్నట్లు సమాచారం.

ఎవరికి ఓటు వేస్తారు

ఓటర్ల అభిప్రాయం తెలుసుకోవడానికి అభ్యర్థులు సాంకేతికతను ఉపయోగిస్తున్నా రు. ఫోన్ల ద్వారా ఎవరికి ఓటు వేస్తారని వివరాలు సేకరిస్తున్నారు. ఐవీఆర్ కాల్స్ ద్వారా కూడా సర్వే చేపడుతున్నారు. ఇలా ప్రస్తుతం ప్రతి ఒక్కరికి నిత్యం రెండు నుంచి మూడు సార్లు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మరోవైపు సోషల్ మీడియాలో సైతం ఒపీనియన్ పోల్స్ నిర్వహిస్తున్నారు. ఆయా సర్వేల ద్వారా వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. తాము వెనుకబడి ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. లోటుపాట్లను తెలుసుకొని ప్రజల మనసు గెలుచుకునేలా హామీలు గుప్పిస్తున్నారు.

న్యూస్‌రీల్

అనుమతి లేని స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో అనుమతి లేకుండా కొనసాగే ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'నో పర్మిషన్.. అయినా అడ్మిషన్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. విద్యార్థులు తల్లిదండ్రులు అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని సూచించారు. అలాగే వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌పై ఫిర్యాదు



సుభాష్‌నగర్: శ్రీరాముడు, సీతమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం దేవిరోడ్ చౌరస్తాలో బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, నాయకులు అద్దంకి దయాకర్‌పై ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి దాత్రిక రమేశ్ మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా రాజకీయ నాయకులు మాట్లాడడం సరికాదన్నారు. అయోధ్య రాముడి అక్షింతలను రేషన్ బియ్యంలో పసుపు, కుంకుమ కలిపి పంపిణీ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి హేళన చేయడం సిగ్గుచేటన్నారు. అద్దంకి దయాకర్ నిర్మల్‌లో జరిగిన సభలో హిందువులను కించపర్చేలా మాట్లాడారని ఆరోపించారు. పాకిస్తాన్ ప్రేమికుడు హిందువులను విమర్శించే స్థాయికి చేరుకున్నాడన్నారు. కేటీఆర్ కూడా జై శ్రీరాం అంటే కడుపు నిండుతుందా అని అవహేళనగా మాట్లాడడం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు. వీరిపై ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు అఖిల్, సురేష్, పాతూరి మహేష్, రాంప్రసాద్ చటర్జీ, నికేష్, ప్రశాంత్, సాయికృష్ణ, రితిక్, ప్రణయ్, రాజు, వెంకటేశ్, శివ, మహేశ్, అఖిలేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజ్‌నాథ్‌సింగ్ సభ రద్దు

బాన్సువాడ: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం బాన్సువాడలో పాల్గొనాల్సిన సభ రద్దయ్యిందని బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం గురువారం బాన్సువాడలోని వీక్లీ మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభలో రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొనాల్సి ఉంది. అయితే అనారోగ్య కారణాలతో ఆయన రావడం లేదని, దీంతో సభను రద్దు చేశారని పార్టీ నాయకులు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

కామారెడ్డి క్రైం: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ శుక్రవారం వరకు పొడిగించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 4,546 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం కోసం మొదట ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు గడువు ఇచ్చారు. దీనిని మరో రెండు రోజులు పొడిగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ తెలిపారు. బుధవారం ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలీస్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

'ఆగండి.. కొంచెం ఆలోచించండి'

కామారెడ్డి అర్బన్: ఓటు వేసే ముందు ఓటర్లు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్, మహిళా వేదిక, జలసాధన సమితి, కామారెడ్డి అధ్యయన వేదికల ప్రతినిధులు కోరారు. బుధవారం కామారెడ్డిలోని సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో 'ఆగండి.. కొంచెం ఆలోచించండి' పేరిట కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే వారికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిటిజన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు జగన్నాథం, సీపీఐ నాయకుడు నర్సింహారెడ్డి, ఏపీటీఎఫ్ ఉమ్మ డి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు వేణుగోపాల్, టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో 42 నుంచి 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వేసవి తాపం నుంచి ఉద్యాన పంటలను సంరక్షించుకోవడానికి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.

మామిడి తోటలకు పదిహేను రోజులకోసారి ఒక నీటి తడిని అందించాలని, అలాగే స్వల్పకాలిక కూరగాయలు, చిక్కుడు జాతి రకాలను సాగు చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ తోటలో ఆకులు కోయడం, లోతు దుక్కులు తీయకూడదన్నారు. చెట్ల పాగులో డ్రిప్పర్ల ద్వారానే నీటిని సరఫరా చేయాలని, పాగుల్లో జనుము వంటి పంట విత్తనాలను చల్లితే మొక్కలకు సంరక్షణగా ఉంటాయన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉద్యాన పంటలను ఎండనుంచి సంరక్షించుకోవాలని ఆయన సూచించారు.

జాతీయస్థాయి 'ప్రేరణ'కు ఎంపిక

నిజామాబాద్ అర్బన్: జిల్లాస్థాయిలో నిర్వహించిన 'ప్రేరణ' పోటీల్లో ప్రతిభకనబర్చి ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 10వ తేదీన జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో 'ప్రేరణ' పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న వర్నిలోని మల్లారెడ్డి మెమోరియల్ పాఠశాల పదో తరగతి విద్యార్థి శ్రీదీక్షిత్ (వర్ని), నవీపేట మండలం బినోల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని భవానీ ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఎంపికైన ఇద్దరు విద్యార్థులు జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న శిక్షణలో పాల్గొంటారని తెలిపారు.

శిక్షణ తరగతుల తనిఖీ


నిజామాబాద్ అర్బన్: నగరంలోని కసాబ్‌గల్లీ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న టెక్నికల్ టీచర్స్ కోర్సు శిక్షణ తరగతులను జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖాధికారి సూచించారు. డీఈవో వెంట శిక్షణ తరగతుల ఇన్‌చార్జి సాయిరెడ్డి, వాసుదేవరావు తదితరులు ఉన్నారు.

'అయోధ్య వైభవం' పుస్తకావిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని హరిచరణ్ మార్వాడీస్కూల్‌లో బుధవారం సంస్కార భారతి ఇందూరు ఆధ్వర్యంలో 'అయోధ్య వైభవం' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభాధ్యక్షుడు నరేందర్ భాయ్‌షా, గౌరవ అతిథులు గణపతి అశోక్ శర్మ, వక్త కృష్ణశాస్త్రి, విజయ భాస్కర్, ఇందూరు జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ చామకూర శ్రీనివాస్ రెడ్డి, రాజ్‌కుమార్ సుభేదర్, దస్తగిరి, గంట్యాల ప్రసాద్ పుస్తకావిష్కరణ చేశారు. అంతకుముందు జ్యోతిప్రజ్వలన చేశారు. భారతదేశ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు, శ్రీరాముని రూపంలో ఆయోధ్య వైభవంగా జిల్లా కవులందరు కవితా సంకలనంగా తీసుకురావడం అభినందనీయమని కవి గణపతి అశోక్‌శర్మ అన్నారు. కవులందరికి ప్రశంసా పత్రాలు, సన్మానాలు చేశారు. జిల్లా కవులు, సంస్కార భారతి ప్రతినిధులు, సాహితి అభిమానులు పాల్గొన్నారు.

ఒక ఎంపీ.. రెండు జిల్లాలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ లోకసభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో నిజామాబాద అర్బన్, రూరల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్ ఐదు నియోజకవర్గాలు నిజామాబాద్ జిల్లాలో ఉండగా, మిగతా రెండు జగిత్యాల, కోరుట్ల ని యోజకవర్గాలు జగిత్యాల జిల్లాలో ఉన్నాయి. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు రెండు జిల్లాలకు చెందిన నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులందరినీ సమన్వయం చేసుకోవాల్సి వస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల స్వరూపం ఇలా ఉంది..

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ నగరంలోని 60 డివిజన్‌లు ఉన్నాయి. ఇక్కడ కార్పొరేటర్లతోపాటు డివిజన్‌ల వారీగా పార్టీల అధ్యక్షులను సమన్వయం చేసుకుంటున్నారు.

నిజామాబాద్‌రూరల్ : అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిజామాబాద్ రూరల్ మండలంతోపాటు మోపాల్, సిరికొండ, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి మండలాలున్నాయి.

ఆర్మూర్ : ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో ఆర్మూర్ టౌన్, ఆర్మూర్ రూరల్, ఆలూర్, మాక్లూర్, నందిపేట్ మండలాలున్నాయి. ఇక్కడ పసుపు రైతులు ఎక్కువగా ఉంటారు.

బోధన్ : బోధన్ నియోజకవర్గం పరిధిలో బోధన్ టౌన్, రూరల్, ఎడపల్లి, నవీపేట్, రెంజల్ మండలాలు ఉన్నాయి. ఇక్కడ ఆసియా ఖండంలోనే అతి పెద్ద చక్కెర కర్మాగారం ఉంది. నిజాంకాలంలో దీనిని ఏర్పాటు చేశారు. తొలి తెలుగు కవి పంపన ఈ ప్రాంతంకు చెందినవారు.

బాల్కొండ : బాల్కొండ నియోజకవర్గంలో బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాలు ఉండేవి. మండలాల పునర్విభజన సమయంలో ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా మండలాలు ఏర్పాడ్డాయి. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మెండోరా మండలంలో ఉంది.

కోరుట్ల : కోరుట్ల నియోజకవర్గం జగిత్యాల జిల్లాలో ఉంది. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలతో జగిత్యాల జిల్లాగా ఏర్పడింది. ఇందులో కోరుట్ల, జగిత్యాల్ నియోజకవర్గాలు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలతోపాటు మెట్‌పల్లి రూరల్ మండలం, కోరుట్ల రూరల్ మండలం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలున్నాయి.

జగిత్యాల : జగిత్యాల జిల్లా కేంద్రంగా ఉంది. ఈ నియోజకవర్గం పరిధిలో జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, సారంగాపూర్, బీర్‌పూర్, మేడిపల్లి, రాయికల్ మండలాలు ఉన్నాయి.



ఆర్మూర్‌లో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు

సీఎం రేవంత్ రోడ్‌షో సక్సెస్

ఆర్మూర్ టౌన్/పెర్కిట్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్ సక్సెస్ అయ్యాయి. అంబేడ్కర్ చౌరస్తాలో కళాకారులు తమ ఆటపాటలతో హుషారెత్తించారు. కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంతోపాటు విలీన గ్రామాలైన పెర్కిట్–కొటార్మూర్, మామిడిపల్లిల్లో సమస్యలను సైతం పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రైతు నాయకుడు అన్వేష్ రెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్ తదితరులున్నారు.




ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కళాకారుల ఆటాపాట

మాలలకు అండగా ఉంటాం



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్, మాల సంఘాల ప్రతినిధులు

- భూ పంపిణీ, కార్పొరేషన్ రుణాలను కాంగ్రెస్ అందించింది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్‌నాగారం: మాలలు తమ సంపూర్ణ మద్దతును తెలుపడం సంతోషంగా ఉందని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మాల, మాల అనుబంధ కులాల ముఖ్య నాయకులతో ఆత్మీయ సమ్మేళనాన్ని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జీవన్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మాలలు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్‌కు సాంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్నారన్నారు. దళితుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ గతంలో భూములు పంపిణీ చేసిందని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించి దళితులను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చిందని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కు చట్టబద్ధత కల్పించి దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. దళితులకు రక్షణకవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరివింద్ హేళన చేస్తూ మాట్లాడిన తీరు యావత్తు దళిత సమాజాన్ని కలవర పెట్టిందన్నారు. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షు డు కేశవేణు, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఆల్ మాలా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గంట సదానందం, అబ్బి ప్రగతికుమార్, బంగారు సాయిలు, నాంది వినయ్ కుమార్, కిష్టయ్య, సీహెచ్ వెంకటరమణ, మూగ ప్రభాకర్, శెట్టిపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాధవనగర్ వద్ద వాహనాల నిలిపివేత

- జిల్లా కేంద్రం నుంచి డిచ్‌పల్లి వైపు వాహనాలను అనుమతించని పోలీసులు
- ప్రయాణికులకు ఇబ్బందులు



నిజామాబాద్ రూరల్: మాధనగర్ రైల్వే గేటు వద్ద పోలీసులు బుధవారం రాత్రి ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి నిజామాబాద్ వైపు నుంచి డిచ్‌పల్లి వైపు వాహనాలను అనుమతించలేదు. అదే సమయంలో వన్‌వే ద్వారా డిచ్‌పల్లి వైపు నుంచి వస్తున్న వాహనాలను జిల్లా కేంద్రం వైపు అనుమతించారు. మరికొన్ని వాహనాలు బైపాస్ మీదుగా నగరం వైపు వెళ్లాయి. నిజామాబాద్‌వైపు నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తున్న వాహనాలు రాత్రి 9 నుంచి 10 గంటల వరకు నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర అసహనానికిలోనై పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. సీఎం వెంట మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ప్రసంగించారు.

చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తాం

- సుదర్శన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే



జీవన్‌రెడ్డిని గెలిపించండి.. జిల్లా అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటా. కాంగ్రెస్‌కు ఓటు వేసి బీజేపీకి బుద్ధి చెప్పండి. జీఎస్టీతో బీజేపీ వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆగస్టు 15 లోగా రైతులకు రుణమాఫీ చేస్తాం. అలాగే సెప్టెంబర్ 15 లోగా చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తాం. జీవన్‌రెడ్డికి 3 లక్షల మెజారిటీ ఇచ్చి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి బహుమతిగా ఇద్దాం.

రైతులపై కేసులు ఎత్తివేయాలి

- డాక్టర్ భూపతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే



మంచిప్ప రిజర్వాయర్ కోసం పోరాడిన రైతులపై బీఆర్ఎస్ ప్రభు త్వం కేసు పెట్టింది. అలాగే జిల్లాలో ఎర్రజొన్న, పసుపు రైతులపై కేసులు పెట్టారు. రైతులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నా. అలాగే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నా.

సీఎం రోడ్డు షో హైలైట్స్



ఖలీల్‌వాడి/ఆర్మూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్ పట్టణంతోపాటు నిజామాబాద్ నగరంలో బుధవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా మీటింగ్‌లకు సంబంధించిన హైలైట్స్..

- ఆర్మూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కళాకారులు తమ ఆటపాటలతో హుషారెత్తించారు.
- సీఎం వచ్చిన హెలీకాప్టర్ సాయంత్రం 6.10గంటలకు ఆర్మూర్ పట్టణంలోని హెలీప్యాడ్‌కు చేరింది.
- దోబీఘాట్ నుంచి కాశీహనుమాన్ వీధి, గోల్‌బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వరకు రోడ్‌షో సాగింది.
- దారిపొడువునా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం రేవంత్ అభివాదం చేస్తూ ముందుకుసాగారు.
- రాత్రి 7.45 గంటలకు ఆర్మూర్‌లో కార్నర్ మీటింగ్ ముగిసింది.
- ఆర్మూర్ నుంచి రోడ్డు మార్గం ద్వారా సీఎం జిల్లా కేంద్రానికి బయల్దేరారు.
- రాత్రి 8:15 గంటలకు నిజామాబాద్‌లోని గోల్‌హనుమాన్ ప్రాంతానికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు.
- సీఎంకు కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.
- గోల్‌హనుమాన్ నుంచి అర్యసమాజ్, పెద్ద బజార్, ఆజాంరోడ్డు మీదుగా నెహ్రూపార్క్ వరకు రోడ్డు షో కొనసాగింది.
- 8:40 గంటలకు నెహ్రూపార్క్‌కు రేవంత్‌రెడ్డి చేరుకున్నారు.
- ముందుగా ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రసంగించగా, చివర రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.
- కార్నర్ మీటింగ్ ముగిసిన తరువాత రోడ్డు మార్గం ద్వారా సీఎం హైదరాబాద్‌కు వెళ్లారు.
- గోల్‌మానుమాన్ నుంచి నెహ్రూపార్క్ వరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- పెద్దబజార్ వద్ద వాహనాల రాకపోకలను డైవర్ట్ చేశారు. సీఎం కాన్వాయ్ వెళ్లిన తర్వాత వాహనాలను అనుమతించారు.
- డీసీపీలు, ఏసీపీలతోపాటు మొత్తం 300 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

రెచ్చగొట్టడం, విభజించడం అర్వింద్ పాలసీ

- మేయర్ చేస్తానంటే రూ.4కోట్లు ఇచ్చా
- ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఆయన బాధితులు
- బీజేపీ కార్పొరేటర్ సవిత భర్త మీసాల శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న మీసాల శ్రీనివాస్

నిజామాబాద్‌నాగారం: రెచ్చగొట్టడం, విభజించి పాలించడం ఎంపీ అర్వింద్ పాలసీ అని బీజేపీ కార్పొరేటర్ మీసాల సవిత భర్త మీసాల శ్రీనివాస్ ఆరోపించారు. దేశంలో మోదీ గెలవాలని, జిల్లాలో మాత్రం అర్వింద్‌ను ఓడించాల్సిందేనని అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీకి వ్యతిరేకంగా తాను ఎనాడూ పని చేయలేదని, తనను సస్పెండ్ చేసే అర్హత జిల్లా అధ్యక్షుడికి లేదన్నారు. మేయర్ చేస్తానంటే అర్వింద్‌కు రూ.4కోట్లు ఇచ్చానని, చివరి క్షణంలో పేరు మార్చి మోసం చేశాడని ఆరోపించారు. తాము ఇప్పటికీ బీజేపీలో ఉన్నామని, ఒక వేళ తాము తప్పు చేస్తే చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర క్రమశిక్షణ కమిటీకే ఉంటుందన్నారు. పార్టీ మనుగడ కోసం అర్వింద్‌ను సస్పెండ్ చేయాలని, కార్యకర్తలను ఆయన పట్టించుకోడన్నారు. నియోజకవర్గానికి అర్వింద్ చేసింది శూన్యమని, ఎంపీ నిధులు వాడుకోలేని దద్దమ్మ అని ఘాటు విమర్శలు చేశారు.

అర్వింద్ బాధితులందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని.. ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సైతం ఆయన వ్యవహారశైలితో విసిగిపోతున్నారన్నారు. అమిత్‌షా మీటింగ్‌లో ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు జరిగిన అవమానం ప్రజలకు జరిగిన అవమానమని, అరవింద్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తదితర హిందూ సంస్థలు వద్దన్నప్పటికీ అధిష్టానం అర్వింద్‌కు టికెట్ ఇచ్చిందని, నిజామాబాద్‌లో ఆయనను ఓడిస్తే పార్టీకి వచ్చే నష్టమేమీ లేదన్నారు.

పీఎఫ్ఐ, సిమికి మాతృసంస్థ కాంగ్రెస్

- కాంగ్రెస్‌కు ఉగ్ర సంస్థల మద్దతు
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆరోపణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: పీఎఫ్ఐ, సిమి ఆర్గనైజేషన్లకు కాంగ్రెస్ మాతృసంస్థగా మారుతోందని, ప్రపంచంలోని ఉగ్రవాద సంస్థలన్నీ ఆ పార్టీకి మద్దతు పలుకుతూ, ఫండింగ్ చేస్తున్నాయని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆరోపించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

నిషేధిత సిమి సంస్థ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానం చేసిన కాపీలను మైనార్టీ ఏరియాల్లో యువకులు పంచుతున్నారని తెలిపారు. ముస్లిములను ఓబీసీల్లో చేర్చి రిజర్వేషన్లు కల్పిస్తుందని, అందుకే కాంగ్రెస్‌కు ఓటేయాలని తీర్మానం చేశారన్నారు. కాంగ్రెస్ గెలిస్తే సిమి, ఉగ్రవాద సంస్థ కంట్రోల్‌లో ఉంటుందని ఆరోపించారు. బీజేపీకి 400 ఎంపీ సీట్లు ఇవ్వకుంటే రామమందిరానికి బాబ్రీ తాళం వేస్తారని మోదీ ప్రకటించారని గుర్తుచేశారు. పీఎఫ్ఐకి జగిత్యాల్, నకిలీ పాస్‌పోర్టులకు బోధన్ అడ్డాగా మారాయని, నిజామాబాద్‌లోని మైనార్టీ ఏరియాల్లో ఎన్ఐఏ పలుమార్లు దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకుందన్నారు. సీఏఏ, యూనిఫామ్ సివిల్ కోడ్, ఎన్ఆర్సీ, ఆర్టికల్ 370పై కాంగ్రెస్ స్టాండ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇవి హిందువుల ఉనికి కాపాడే ఎన్నికలని, ఇప్పటికైనా హిందూ సమాజం కళ్లు తెరవాలని కోరారు. అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, ఎర్రం సుధీర్, సుక్క మధు, మాస్టర్ శంకర్, బంటు రాము తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి వృద్ధుడి మృతి

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అడవిమామిడిపల్లికి చెందిన తెడ్డు పోశన్న(70) బోర్గాం (కే)లో తాత్కాలికంగా నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఉదయం మానిక్‌బండార్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్మూర్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో పోశన్న తలకు బలమైన గాయం కావడంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు తెడ్డు నడ్పి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు.

21 కేసులు కొట్టివేత

బోధన్‌టౌన్(బోధన్): ఎడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి బజార్‌లో షెడ్డులను అక్రమంగా తొలగించారని వేసిన 21 కేసులను బోధన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కొట్టివేస్తూ బుధవారం తీర్పును వెల్లడించారు. ఏజీపీ మోహన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019–20లో ఎడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిబజార్‌లో 20 మంది అక్రమంగా షెడ్డులు వేయగా, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. దీంతో షెడ్డులు వేసినవారు కోర్టును ఆశ్రయించారు. సాక్ష్యాధారాలు రుజువుకాకపోవడంతో న్యాయమూర్తి కేసులు కొట్టివేశారు.

మైనర్ల ఆచూకీ గుర్తింపు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్లు ప్రేమ పేరుతో 14 రోజుల క్రితం బయటికి వెళ్లిపోగా.. వారి ఆచూకీని గుర్తించినట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. మైనర్లు మెట్‌పల్లిలో ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించామన్నారు. బాలికను జిల్లాకేంద్రంలోని సఖీ సెంటర్‌కు, బాలుడిని బాయ్స్ అబ్జర్వేషన్ కేంద్రానికి అప్పగించామని తెలిపారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు

దోమకొండ: దోమకొండ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా బలమైన గాలి వీస్తూ వర్షం కురిసింది. గంటపాటు గాలులు బలంగా వీయడంతో రోడ్లపై చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కల్లాల్లో ధాన్యం తడవగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సైతం సాయంత్రం నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా లేదు. బుధవారం సైతం ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అర్ధరాత్రి వరకు విద్యుత్ పునరుద్ధరించే పరిస్థితి లేదని విద్యుత్ అధికారులు తెలిపారు. ఇటు వర్షం, అటు కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో పలు ఇళ్లపై ఉన్న రేకులు లేచిపోయాయి. శివరాంమందిర్ ఏరియాలో రేకుల షెడ్డు ఎగిరిపడగా ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చింతమాన్‌పల్లిలో ఓ ఇంటిపై చెట్టు కూలింది.

తడిసిన ధాన్యం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. కామారెడ్డిలోని గాంధీగంజ్‌లో ధాన్యం కొట్టుకుపోయింది. గాలులకు ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు.



కామారెడ్డిలో ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

భిక్కనూరులో

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వడ్లు, మక్కలు ఆరబెట్టుకున్న రైతులు వర్షంతో ఆందోళన చెందుతున్నారు.